## విలేజ్ పోలీస్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

● ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ఉత్తమ సేవలందించిన పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ

నీలగిరి, మే14 : విలేజ్ పోలీస్ వ్యవస్థ ద్వారా ప్రజలు అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన సేవలు అందిస్తూ వారికి సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సూచించారు. బుధవారం ఎస్పీ కార్యాలయం నుంచి జిల్లా పోలీస్ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలను ప్రతిరోజు సందర్శించి సమస్యలపై ప్రజలతో మమేకం కావాలన్నారు. ప్రజలు పోలీసుల మధ్య సత్సంబంధాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేర నియంత్రణ సాధ్యం అవుతుందన్నారు. గ్రామాల్లోకి వచ్చే అనుమానితుల వివరాలు ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. సైబర్ నేరాలు, అక్రమ బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల వల్ల కలిగే అనర్థాలు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సమర్థవంతంగా సేవలు అందించిన ఏడుగురు గ్రామ పోలీసులను ఎస్పీ అభినందించి రివార్డులు అందించారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి : ఏడీఏ

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏడీఏ జానిమియా

కేతేపల్లి, మే 14 : వానకాలం సీజన్ ప్రారంభమవుతున్నందున డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని నకిరేకల్ ఇన్‌చార్జి ఏడీఏ ఎండీ.జానిమియా సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు. స్టాక్ వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు, పురుగుల మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి బి.పురుశోత్తం, ఏఈఓ నాగరాజు పాల్గొన్నారు.

### విత్తనాలు ఎమ్మార్పీకే విక్రయించాలి

గుర్రంపోడు : విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఎమ్మార్పీకే విక్రయించాలని, లేక పోతే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలకేంద్రంలోని రైతు వేదికలో డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో ఏఈఓలు, డీలర్లు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

● ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి

సమ్మె పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

రామగిరి, మే 14: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి కోరారు. సమ్మె పోస్టర్లను బుధవారం సంఘం జిల్లా కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. కార్మికులంతా సమ్మెలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కేవీఎస్.రెడ్డి, లెనిన్, గుండె రవి, ఎండీ జాని, సత్యనారాయణ పాల్గొన్నారు.

### లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

నకిరేకల్ : కార్మిక చట్టాల స్థానంలో కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని కోరుతూ నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని సీఐటీయూ జిల్లా నాయకుడు వంటెపాక వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు తాడ్వాయి రాములు, సూరారపు వీరయ్య, బి.కృష్ణ, మల్సూర్, బాతుక సైదులు, ఎండీ హఫీజ్ పాల్గొన్నారు.

## సీబీఎస్ఈ ఫలితాల్లో నల్లగొండ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

మోక్ష సాయి సంజన

రామగిరి, మే 14: సీబీఎస్ఈ పదవ తరగతి ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని నల్లగొండ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పార్థసారధి తెలిపారు. పాఠశాలకు చెందిన మోక్షసాయి సంజన 489 మార్కులు, మ్యాథమెటిక్స్‌లో ఆమని 100 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ఐటీలో ఏడుగురు విద్యార్థులు 100 మార్కులు పొందినట్లు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించి విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

నిడమనూరులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం

నిడమనూరు, మే 14 : మండలంలోని సోమోరిగూడెంలో ఏర్పాటు చేసిన సింగిల్ ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్య నివారణకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యడవల్ల వల్లభ్‌రెడ్డి, నాయకులు మేరెడ్డి వెంకట్ బాబు, ముంగి శివ మారయ్య, కొండా శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగ్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

త్రిపురారం : మండలంలోని మాటూరు గ్రామంలో విద్యుత్ లోఓల్టేజీ సమస్య తలెత్తడంతో బుధవారం 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో మండల సహాయ ఇంజినీర్ ఎ.బాలూనాయక్ తెలిపారు. కార్యక్రమంలో లైన్‌మెన్‌లు ఒంటెద్దు భాస్కర్‌రెడ్డి, మోతీలాల్‌నాయక్, జూనియర్ లైన్‌మెన్ కె.నాగయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336370-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో పూర్తిగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ: 9182777625, 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | చౌటుప్పల్: 9182777638

## అదనపు బ్లాక్ నిర్మాణంతో ఉద్యోగులకు వసతులు

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టరేట్ అదనపు భవనాల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కలెక్టర్

నీలగిరి, మే15 : కలెక్టరేట్ సమీకృత భవన సముదాయంలో రూ.40 కోట్లతో ఉద్యోగులకు కావాల్సిన అన్ని వసతులతో అదనపు బ్లాక్ నిర్మాణం చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు బ్లాక్ నిర్మాణ పనులకు ఆమె భూమి పూజ నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న భవనంలో కొన్ని శాఖలు మాత్రమే ఉన్నాయని, డీఎంహెచ్ఓ, డీఈఓ కార్యాలయాలు బయట ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యాలయంలో ప్రస్తుతం ఉన్న సమావేశ మందిరం సరిపోవడం లేదన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని జీ ప్లస్ టూ విధానంలో అదనపు బ్లాక్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. పది నెలల్లో భవనాన్ని పూర్తి చేస్తామని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్లు నారాయణ్ అమిత్, రాజ్‌కుమార్, ఇన్‌చార్జి డీఆర్ఓ వై. ఆశోక్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ సీఈ రాజేశ్వర్‌రెడ్డి, ఎస్ఈ వెంకటేశ్వర్‌రావు, ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈఈ ఫణిజా, గణేశ్, కలెక్టరేట్ ఏఓ మోతీలాల్, డీపీఓ వెంకటయ్య పాల్గొన్నారు.

### భవిత కేంద్రం సందర్శన

రామగిరి : నల్లగొండలోని భవిత కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఆమె వెంట ఆర్డీఓ అశోక్‌రెడ్డి, ఎంఈఓ అరుంధతి ఉన్నారు.

### కొనుగోళ్లను వేగవంతం చేయాలి

నార్కట్‌పల్లి : ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణ వెల్లెంల గ్రామంలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను తనిఖీ చేశారు. మౌలిక సదుపాయాలను పరిశీలించి పెండింగ్ పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నార్కట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో వసతులకోసం సిబ్బంది కలెక్టర్‌కు విన్నవించగా అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, ఆర్డీఓ వై. శేఖర్‌రెడ్డి, తాసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, వైద్య సిబ్బంది ఉన్నారు.

## 16న గుండ్రాంపల్లిలో సీపీఐ మండల మహాసభ

చిట్యాల, మే 14 : ఈ నెల 16న గుండ్రాంపల్లిలో సీపీఐ మండల మహాసభ నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్ తెలిపారు. బుధవారం పార్టీ గుండ్రాంపల్లి గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పార్టీ గ్రామ శాఖ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ కార్యదర్శిగా జిల్లా సత్యం, సహాయ కార్యదర్శులుగా కేతరాజు అంజయ్య, సీమ అంజయ్య, కార్యవర్గ సభ్యులుగా జిల్లా లింగస్వామి, గోపగోని శేఖర్, రత్నం లింగ స్వామి, రెడపాక రవి, పానుగుల శివ, బొబ్బల శంకర్‌రెడ్డి, బెదరకోట సైదులు ఎన్నికయ్యారు. సమావేశంలో మండల కార్యదర్శి ఎండీ అక్బర్ పాల్గొన్నారు.

## నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మిర్యాలగూడ, మే 14: మండలంలోని వెంకటాద్రిపాలెం సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు నిర్వహిస్తున్నందున పలు గ్రామాలకు గురువారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో మిర్యాలగూడ రూరల్ ఏఈ అమర్‌సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటాద్రిపాలెం, ఇండస్ట్రీయల్ ఏరియా, శ్రీనివాస్‌నగర్, దుబ్బతండా, తుంగపాడు, నల్లగట్టుతండా, లావూడితండా, సామ్యగాని తండా, టీక్యాతండా, కేశవానగర్‌కాలనీ, కొత్తూరు, భాగ్యగోపసముద్రంతండా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. దాంతో పాటు నందిపాడు సబ్‌స్టేషన్‌కు వచ్చే 33కేవీ లైన్‌కు ఆనుకుంటున్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున నందిపాడు, ఐలాపురం, చిల్లాపురం, ట్యాంక్‌తండా, కొక్యాతండా, మైసమ్మతండా గ్రామాలకు సైతం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని పేర్కొన్నారు.

## కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపించాలి: తాసీల్దార్

చందంపేట(దేవరకొండ), మే 14 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని మిల్లులకు ఎగుమతి చేసేందుకు వీలుగా లారీలను అందుబాటులో ఉంచాలని తాసీల్దార్ గోవర్ధన్‌రెడ్డి సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. బుధవారం తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పోలేపల్లి, గుంటిపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. ధాన్యం కొనుగోళ్లల్లో జాప్యం జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని మిల్లుల యాజమాన్యాలు త్వరితగతిన దిగుమతి చేసుకోవాలని సూచించారు.

### అడవిదేవులపల్లి తాహసీల్దార్‌గా రాగ్యానాయక్

అడవిదేవులపల్లి, మే 14: అడవిదేవులపల్లి తాసీల్దార్‌గా వి.రాగ్యానాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గుండ్లపల్లి తాసీల్దార్‌గా పనిచేస్తున్న రాగ్యానాయక్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇన్‌చార్జిగా ఉన్న శ్రీనివాసులు డీటీగా విధులు నిర్వర్తించనున్నారు.

## ఎంజీయూపై ప్రభుత్వ వైఖరి సరికాదు

● బీఆర్ఎస్వీ నాయకుడు వాడపల్లి నవీన్

రామగిరి, మే 14: నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీపై రాష్ట్ర ప్రభుత్వం వివక్షను ప్రదర్శిస్తుందని బీఆర్ఎస్వీ ఎంజీయూ నాయకుడు వాడపల్లి నవీన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంజీయూలో న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి పత్రాలు అందచేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని తెలిపారు. దీంతో నల్లగొండ జిల్లా విద్యార్థులు హైదరాబాద్‌కు వెళ్లి చదువుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. జిల్లా మంత్రి చొరవ చూపి న్యాయ కళాశాల అందుబాటులోకి తేవాలని కోరారు. తాజా పాలమూరు యూనివర్సిటీకి న్యాయ కళాశాల, బీటెక్, ఇతర కోర్సులు మంజూరు చేయడంతోపాటు బడ్జెట్ కూడా కేటాయించిందన్నారు. కానీ ఎంజీయూకు మాత్రం ఎలాంటి కోర్సులు మంజూరు చేయకుండా సవతి తల్లిప్రేమ చూపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వివక్ష విడనాడక పోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలని రిలే దీక్షలు

వెల్మకన్నె గ్రామంలో నిరాహార దీక్ష చేస్తున్న గ్రామస్తులు

గట్టుప్పల్, మే 14 : అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ మండలంలోని వెల్మకన్నె గ్రామస్తులు బుధవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్మకన్నె గ్రామంలో 1999లో సర్వే నంబర్ 55లో అప్పటి ప్రభుత్వం పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించిందని తెలిపారు. అయితే అందులో ఇండ్ల నిర్మాణం చేసుకోక పోవడంతో తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని గ్రామాభివృద్ధికి వినియోగించాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు. అయితే సదరు భూమిని పక్క పట్టదారు ఆక్రమించుకున్నాడని తెలిపారు. సదరు పట్టాదారు ఎకరం భూమిని ఆక్రమించుకున్నాడని, దానిని స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. సదరు భూమిని ఆక్రమణ దారు నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు.

## దివ్యాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ఉద్యమం

**దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్**

చండూరు,మే 14: పంచాయతీ ఎన్నికల్లో దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సమర శంఖం పూరిస్తామని దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ అన్నారు. బుధవారం చండూరులో నిర్వహించిన రాజ్యాధికారి సాధన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగుల పింఛన్లు రూ.6వేలకు పెంచుతామని, ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, రాష్ట్రంలో దివ్యాంగుల అట్రాసిటీ చట్టాన్ని అమలు చేస్తామని, దివ్యాంగుల సంక్షేమశాఖను ప్రత్యేక శాఖగా గుర్తించి అధికారులను నియమిస్తామని హామీ ఇచ్చిందన్నారు. బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, పంచాయతీ ఎన్నికల్లో దివ్యాంగులకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తామని పేర్కొందన్నారు. దివ్యాంగుల ఓట్లతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసి 16 నెలలు పూర్తయినా హామీలు అమలు చేయలేదన్నారు. సంఘం మండలాధ్యక్షుడు ఆకారపు వెంకన్న అధ్యక్షతన జరిగిన సభలో సంఘం రాష్ట్ర మహిళ నాయకురాలు గుడిపల్లి సుమతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరు ఈదయ్య బాబు, జిల్లా అధ్యక్షుడు చిన్నపాక మత్స్యగిరి, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గోగుల శేఖర్‌రెడ్డి, మునుగోడు మండలాధ్యక్షుడు సహదేవుడు, నాయకులు బొమ్మరబోయిన శ్రీకాంత్, రేణుక, రమేశ్, షార్వోని పాల్గొన్నారు.

## గిరిజన సంస్కృతి పరిరక్షణకు కృషి చేయాలి

● మాజీ ఎంపీపీ భగవాన్‌నాయక్

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీపీ భగవాన్‌నాయక్

తిరుమలగిరి(సాగర్), మే 14: గిరిజన సంస్కృతిని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్ అన్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించే టీఆర్‌జీఎస్ రాష్ట్ర శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆయన మండలంలోని రంగుండ్ల గ్రామంలో ఆవిష్కరించి మాట్లాడారు. గిరిజనుల నృత్యాలు, భాష, దుస్తులు, ఆభరణాలు, పండుగలు, వేడుకలను ఎన్నటికీ మర్చి పోవద్దన్నారు. శిక్షణ తరగతుల్లో అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్‌జీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర శంకర్‌నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమావత్ జవహర్ నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రమావత్ నరేశ్‌నాయక్, నాయకులు మెగావత్ భాస్కర్ నాయక్, రమావత్ రమేశ్‌నాయక్, ఆంగోతు బాబూరావునాయక్, నేనావత్ అశోక్‌నాయక్ పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

● ఎమ్మెల్యే వేముల వీరేశం

నెల్లిబండ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, మే 14 : అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హామీ ఇచ్చారు. బుధవారం నకిరేకల్ మండలంలోని నెల్లిబండలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కిరణ్‌కుమార్, ఎంపీడీఓ చంద్రశేఖర్, తాసీల్దార్ ఎస్‌కే జమీరొద్దీన్, హౌసింగ్ డీఈ రాంనర్సింహారెడ్డి, ఏఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి స్వాతి, మాజీ ఉపసర్పంచి బొడ్డుపల్లి లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

## మండలాల్లో విద్యుత్ సమస్యలు గుర్తించాలి

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, మే 14: మండల కేంద్రాలల్లో ఉన్న విద్యుత్ సమస్యలను అధికారులు గుర్తించాలని స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నాయకులకు సూచించారు. బుధవారం నియోజకవర్గంలోని అన్ని మండలాల ముఖ్యనాయకులతో స్థానిక క్యాంపు కార్యాలయంలో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం విద్యుత్ శాఖ సీఎండీ ముషారఫ్‌ను కలిసి నియోజకవర్గ వ్యాప్తంగా నెలకొన్న కరెంట్ సమస్యలు తీర్చాలని కోరినట్లు తెలిపారు. గట్టుప్పల్ మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేసే అథారిటీ ఇంకా రాలేదని నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా డీజీపీతో ఫోన్లో మాట్లాడి గట్టుప్పల్ పోలీస్‌స్టేషన్‌కు పూర్తిస్థాయిలో ఎఫ్ఐఆర్ అథారిటీ కల్పించాలని, చండూరుకు డీఎస్పీ పోస్టు మంజూరు చేయాలని కోరారు.

## అమరవీరుల స్థూప నిర్మాణానికి శంకుస్థాపన

అమరవీరుల స్మారక స్థూప నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న హన్మంతరావు

శాలిగౌరారం, మే 14 : మండలంలోని వల్లాల గ్రామం లో అమరవీరుల స్మారక స్తూపం నిర్మాణానికి బుధవారం రాజ్యసభ మాజీ సభ్యుడు హన్మంతరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1948లో వల్లాల గ్రామంలో కొంత మంది విద్యార్థులు స్థానిక పాఠశాలలో జాతీయజెండాను ఎగురవేశారని, దాంతో అప్పటి నవాబుల ప్రైవేట్ సైన్యం వారిని కాల్చిచంపారన్నారు. వారి జ్ఞాపకార్థం గ్రామంలో స్మారక స్తూపాన్ని తన సొంత నిధులతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఇంతియాజ్‌అహ్మద్, దండ రేణుకాఅశోక్‌రెడ్డి, నాయకులు అన్నెబోయిన సుధాకర్, కందాల సమరంరెడ్డి, నరిగె నర్సింహా, నోముల జనార్దన్, భూపతి అంజయ్య పాల్గొన్నారు.

## గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

అన్నారంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, మే 14: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం అధికారులతో కలిసి మండలంలోని అన్నారం గ్రామంలో ఆయన పర్యటించారు. సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట వివిధ శాఖల అధికారులు, నాయకులు ఉన్నారు.

## వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం

సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులు, పక్కన నాయకులు

మిర్యాలగూడ, మే 14: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్, హ్యాండ్‌బాల్ సమ్మర్ క్యాంప్‌ను బుధవారం ఎన్‌వీఆర్ యూత్ నాయకులు ప్రారంభించారు. అనంతరం క్రీడల్లో పాల్గొనే చిన్నారులకు పండ్లు, పోషకాహారం అందించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్, మహేందర్‌రెడ్డి, రవినాయక్, వెంకటేశ్వర్లు, అశోక్, నాగరాజు, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**చేపలు పట్టేందుకు వెళ్తున్న వారి ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బొలెరో**

మిర్యాలగూడ(మాడ్గులపల్లి), మే 14: మాడ్గులపల్లి మండల శివారులో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం రుద్రారం గ్రామానికి చెందిన గంధం వీరయ్య, నల్లగంతుల రామయ్య(50), కర్ర మాధవ్, కొండ నాగయ్యతోపాటు మరికొందరు మాడ్గులపల్లి మండలం దాచారం చెరువులో చేపలు పట్టేందుకు ట్రాక్టర్‌లో బయల్దేరారు. ఉదయం 6గంటల సమయంలో మాడ్గులపల్లి గ్రామ శివారులోని భారత్ పెట్రోల్‌బంక్ వద్ద మిర్యాలగూడ నుంచి వస్తున్న బొలేరో వాహనం ట్రాక్టర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దాంతో ట్రాక్టర్‌లో ఉన్న వారు కిందపడిపోయారు. గంధం వీరయ్య, నల్లగంతుల రామయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నల్లగంతుల రామయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. మృతుడి భార్య నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రైతుల దారిపై దయ చూపరూ..!

● గుంతలమయంగా మారిన మల్లాపురం రోడ్డు ● మార్కెట్‌కు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్న రైతులు

గుంతలమయంగా మారిన మల్లాపురం పాత రహదారి

పెద్దఅడిశర్లపల్లి, మే 14 : మండలంలోని వివిధ గ్రామాల నుంచి పీఏపల్లి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డుకు వెళ్లే రోడ్డు పూర్తిగా శిథిలమైంది. పీఏపల్లి, దుగ్యాల, తిరుమలగిరి, మేడారం గ్రామాల రైతులు తమ ధాన్యాన్ని పాత మల్లాపురం రోడ్డు మీదుగా మార్కెట్ యార్డుకు తీసుకెళ్తారు. కానీ ప్రస్తుతం ఈ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో పాటు రోడ్డుకు రెండు వైపులా కంపచెట్లు పెరగడంతో మూసుకు పోయింది. రోడ్డును బాగు చేయించాలని రైతులు అనేక మార్లు కోరినా మార్కెట్ నిర్వాహకులు, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దాంతో ప్రస్తుతం రైతులు పీఏపల్లి మండల కేంద్రం మీదుగా రెండు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించి మార్కెట్ యార్డుకు ధాన్యం తీసుకు రావాల్సి వస్తున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్కెట్ యార్డు నుంచి మల్లాపురం వెళ్లే పాత రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## టాప్‌పై ప్రయాణం.. అదుపుతప్పితే ప్రమాదం

కంబాలపల్లికి జీపుపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న ప్రజలు

చందంపేట, మే 14 : మండంలోని మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు సమయానుకూలంగా అందుబాటులో లేక పోవడంతో ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. మండలంలోని చిత్రియాల, బుడ్డోనితండా, పెద్దమూల, రేకులగడ్డ, యాపలపాయ తండా, నేరుట్లతండా, చౌటుట్ల తండా, ఉస్మాన్‌కుంట, పాత కంబాలపల్లి, సొగిళ్ల గ్రామాలకు చెందిన ప్రజలు ఆటోలు, ప్రైవేటు జీపుల్లో ప్రయాణిస్తున్నారు. ప్రజల బలహీనతను ఆసరాగా చేసుకుంటున్న ప్రైవేటు వాహనదారులు కెపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఆటోల వెనుక, జీపుల టాప్ పైన కూడా ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ప్రయాణికులు పట్టుతప్పితే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. పోలీసులు ప్రైవేటు వాహనాలు కెపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కించుకోకుండా చూడాలని, ఆర్టీసీ అధికారులు బస్సులను అన్ని గ్రామాలకు నడిపించి ప్రజల ఇబ్బందులు తీర్చాలని ఆయా తండాల ప్రజలు కోరుతున్నారు.